

# హృదయమెరిగిన కిరణం

ఆరోజు నా పుట్టినరోజు.

పెళ్ళయ్యాక వచ్చిన తొలి జన్మదినం అది.

అందుకే 'హేపీ బర్త్‌డే' అంటూ శ్రీవారు ప్రేమతో ఇచ్చిన ముద్దు ముద్దు మేలుకొలుపుతో ఆహ్లాదకరంగా దినచర్య ప్రారంభమైంది. అయితే ఇద్దరికీ ఆఫీసు వుండడంతో సాయంత్రం సెలబ్రేట్ చేసుకోవాలని అనుకున్నాం. నేను హడావుడిగా ఆఫీసుకు రెడీ అవుతుంటే కాలింగ్‌బెల్ మ్రోగింది.

వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా ఓ అపరిచిత వ్యక్తి. ముప్ఫయ్యేళ్లు వుంటాయేమో. చిరునవ్వుతో నిలబడి వున్నాడు. ఎవరు కావాలన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాను.

"నా పేరు కిరణ్. మిసెస్ భార్గవ్‌గారి కోసం వచ్చాను" అన్నాడు.

"నేనే మిసెస్ భార్గవ్‌ని" అన్నాను.

"ఓ... మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే. ఈరోజు మీ బర్త్‌డే కదా!" అన్నాడు.

నాకు కోపం, ఆశ్చర్యం రెండూ కలిగాయి.

"మీరెవరో... నాకు గుర్తురావడం లేదు" అన్నాను.

"నన్ను మీరెపుడూ చూడలేదు లెండి. నాక్కూడా మీరెవరో తెలీదు. మీ ఫ్రెండ్ రాజశేఖరని..." అని ఆగిపోయాడు.

"రాజశేఖర్! ఆ..ఆ.." అన్నాను.

"ఆయన మీకిది ప్రజెంట్ చేయమన్నారు" అని గులాబీపూల బొకేని నా చేతిలో పెట్టాడు.

రకరకాల రంగుల పెద్ద గులాబీలన్నీ ఏరి కూర్చిన ఆ బొకేని చూడగానే అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రాజశేఖర్ గుర్తుంచుకుని నాకీ ప్రజంటేషన్ పంపినందుకు నేను ఎంతగానో సంతోషపడిపోయాను. ఆ ఆనందంలో నా నోటివెంట మాటలు పెగల్లేదు.

'హలో.. హలో.. ఏమండీ" అని కిరణ్ అనడంతో తేరుకున్నాను. క్షణంసేపు సిగ్గుపడ్డాను. అప్పటివరకు అతన్ని గుమ్మం దగ్గరే నిలబెట్టేసినందుకు బాధపడుతూ, లోపలికి ఆహ్వానించాను.

ఇంతలో మావారు అక్కడికి వచ్చారు. అప్పటికే ఆయన ఆఫీస్‌కి వెళ్లడానికి రెడీ అయిపోయారు. నేను కిరణ్‌కి పరిచయం చేశాను. ఇద్దరూ కరచాలనం తర్వాత విజిటింగ్ కార్డ్స్

**మనసాంపుగా**

ఇచ్చి పుచ్చుకున్నారు. నేను రాజశేఖర్ పంపిన బొకేని మావారికి చూపించాను.

"వండర్‌ఫుల్. నీ బర్త్‌డేకి ఇంతకంటే మంచి గిఫ్ట్ ఏముంటుంది?" అని మెచ్చుకున్నారు.

"మీరిద్దరూ మాట్లాడుతూ వుండండి. నేను కాఫీ తెస్తాను" అని లోపలికి వెళ్ళబోయాను.

"నో ఫార్మాలిటీస్ ప్లీజ్. నేను అర్జంట్‌గా వెళ్ళాలి" అన్నాడు కిరణ్. మాక్కూడా ఆఫీస్ టైమ్ కావడంతో బలవంతం చేయలేదు. కిరణ్ వెళ్ళిపోయాడు.

రోజూ ఆయన స్కూటర్ మీద నన్ను మా ఆఫీస్ దగ్గర దింపేసి తన ఆఫీస్‌కి వెళ్తుంటారు. ఆ రోజున కూడా అలాగే వెళ్తుంటే దారిలో ఆయన అడిగారు.

"రాజశేఖర్.. ఇప్పుడెక్కడున్నారు?"

"తెలీదండి."

"మరి ఈ బొకేని ఎక్కణ్ణించి పంపారు?"

"తెలీదు"

"అసలు ఈ కిరణ్‌కి రాజశేఖర్ ఎలా తెలుసు?"

"ఏమో..."

"మరీ ఇంత అయోమయమా! మరి అతన్తో ఏం మాట్లాడావ్?"

"ఏంటో.. మరి. బొకేని చూడగానే అన్నీ మరచిపోయాను. అసలేం మాట్లాడాలో, ఏం చేయాలో.. ఏమీ తోచలేదు" అన్నాను.

"నేనో పని చేస్తా. సాయంత్రం కిరణ్‌ని మనింటికి డిన్నర్‌కి పిలుస్తా. నీ బర్త్‌డే కాబట్టి తప్పనిసరిగా రమ్మని చెబుతా. అతని విజిటింగ్ కార్డ్ నా దగ్గరుందిగా. అప్పుడు అన్ని విషయాలు తెలుసుకోవచ్చు" అన్నారాయన. నేను సరేనన్నాను.

సమయం ఏడవుతుండగా కిరణ్ వచ్చాడు. ముగ్గురం డాబా మీద కుర్చీలేసుకుని కూర్చున్నాం. నేను ముగ్గురికీ జ్యూస్ చేసి తీసుకొచ్చాను.

కాసేపు కుశలప్రశ్నలు అయ్యాక నేను

కిరణ్‌ని అడిగాను.

"రాజశేఖర్ మీకు బాగా తెలుసా?"

"నాకసలు ఆయనతో పరిచయమే లేదండి" అన్నాడు కిరణ్.

"అయితే.. మరి.. బొకే" అని ఆగిపోయాను.

కిరణ్ నవ్వుతూ

"అదా! చెన్నయ్‌లో నాకు సతీష్ అనే ఫ్రెండ్ వున్నాడు. అతనూ, రాజశేఖర్ కొలీగ్స్. మీ పుట్టినరోజునాడు మీకు ఎంతో ఇష్టమైన గులాబీలను ఎలా పంపించాలా అని రాజశేఖర్‌గారు సతమతమవుతుంటే సతీష్ నాకు ఫోన్ చేసి ఈ ఎరేంజ్‌మెంట్ చేశాడు. మీ కొత్త అడ్రస్ రాజశేఖర్‌గారి దగ్గర లేదట. మీరిద్దరూ ఏయే ఆఫీసుల్లో పనిచేస్తున్నారో చెప్పారు. నిన్న సాయంత్రం నేను మీ ఆఫీస్‌కి ఫోన్‌చేశాను. కాని మీరప్పటికే వెళ్ళిపోయారని చెప్పారు. అడ్రస్ అడిగితే చెప్పారు" అని అసలు విషయం చెప్పాడు కిరణ్.

"మీరు చాలా శ్రమ తీసుకున్నారు. బాగా తెలిసినవాళ్ళే ఏదో ఒక వంక పెట్టి తప్పించుకుపోయే ఈ రోజుల్లో ముక్కూ మొహం తెలియని వ్యక్తి చెప్పిన పనిని మీరు శ్రద్ధగా పూర్తిచేయడం... రియల్లీ హాట్సాఫ్. మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియడం లేదు" అన్నారు మావారు.

"ఇందులో నేను చేసినదేముంది! ఆ మాత్రం హ్యూమన్ రిలేషన్స్ లేకపోతే ఎలా! బొకేని అందుకుంటున్నప్పుడు మీ మిసెస్ ముఖంలో వెలుగుని, పట్టలేనంత ఆనందాన్ని చూశాను. దానితో రాజశేఖర్ మీకెంత ముఖ్యులో అర్థమైంది. అలాగే బొకే మీకు చేరిందన్న విషయం తెలుసుకున్నాక రాజశేఖర్‌గారు ఎంత ఆనందిస్తారో ఊహించగలను. ఇంత మందికి ఆనందాన్ని కలిగించే పని చిన్నదైనా, పెద్దదైనా సరే చేస్తున్నప్పుడు కలిగే తృప్తిని దేనితో కొలవగలం!" అన్నాడు కిరణ.

"మీలా ఆలోచించే వారెందరు ఈ రోజుల్లో? కాలం కంటే వేగంగా సాగిపోతున్న నేటి యాంత్రిక జీవనంలో పట్టుమని పది నిమిషాలు మిత్రులకోసం, సహచరుల కోసం. కేటాయించడమే ఎంతో గగనమైపోతోంది. పక్కవాడి గురించి పట్టించుకునే స్థితే లేదు" అన్నారాయన.

"అవునూ. గులాబీల బొకే మీరు తయారు చేయించారా?" అడిగాన్నేను.

"ఔనండి. చెన్నయ్ నుంచి బొకే రావడం కష్టం కదా! అందుకని నన్నే ఆర్డరిచ్చి చేయించమన్నారు. డబ్బులు పంపిస్తామన్నారు లెండి" అంటూ నవ్వేశాడు కిరణ్.

"మీవంటి సహృదయత కలిగిన వ్యక్తి పరిచయం కావడం మా అదృష్టం. బొకేని చూసినపుడు శేఖర్‌నే చూసినంత సంతోషం కలిగింది. ఇపుడు మీ స్నేహంతో ఆ సంతోషం రెట్టింపయ్యింది" మనస్ఫూర్తిగా అన్నాన్నేను.

"మీరు మరీ పొగిడేస్తున్నారు. ఈ పొగడ్తలతోనే కడుపు నింపేస్తారా? భోజనం పెట్టరా?" అన్నాడు నవ్వుతూ కిరణ్.

మేమిద్దరం కిరణ్ నవ్వుతో శృతి కలుపుతూ భోజనానికి ఆహ్వానించాం. ఆ రాత్రే రాజశేఖర్‌కి ఫోన్‌చేసి పుట్టినరోజు కానుకగా గులాబీలతోపాటు ఓ మంచి స్నేహితుడిని అందించినందుకు కృతజ్ఞతలు చెప్పాను.

కిరణ్‌తో స్నేహం మాలో కొన్ని మార్పులు తెచ్చింది. కేవలం అవసరమైనప్పుడు, పనులున్నపుడే కాకుండా తరచు పరిచయస్తులను పలకరిస్తున్నాం. హోదాలు, భేషజాలు లేకుండా అందరికీ అందుబాటులో వుంటున్నాం.

— మోతీలాస్య

## ఐశ్వర్యాన్ని చాటుకునే రోజులొచ్చాయి

కమ్యూనిస్టుల పాలనలో ప్రజలు తమ ఐశ్వర్యాన్ని చూపించడానికి జంకేవారు. ధనవంతులు ఏదో నేరం చేసినట్లుగా ఫీలయ్యేవారు. కాని ప్రస్తుత పరిస్థితి మారిపోయింది. కమ్యునిస్టుల పరాజయం వల్ల పశ్చాత్తాపం చెందినవారు ఇప్పుడు ఎంతో ఎంజాయ్ చేస్తున్నారట. ఇంగ్లాండ్‌లో 'స్త్రీలు'నడిపే వాహనాల వాడకం తిరిగి జనరంజకమైనది. అంతేకాకుండా కొన్ని కంపెనీలు పురాతన వాహనాలు కిరాయిలకు ఇచ్చే వ్యాపారం కూడా ప్రారంభించారు. ఇందులో కొన్ని వాహనాలకు స్త్రీలనే డ్రయివర్లుగా నియమించడం జరిగింది ప్రయాణీకులను ఆకట్టుకోవడానికి. ఈ వాహనాలలో టెలిఫోన్, ఫ్యాక్స్ సౌకర్యాలు కూడా ఉన్నాయి. ఒక బెడ్‌రూం మినహాయిస్తే డ్రైవర్ మరియు వాహనంతో ఎంతో ఎంజాయ్ చేస్తున్నారట అక్కడివాసులు.



